క్లుప్తంగా

ఇసుక టిప్పర్ల సీజ్



వెంకటాపురం(కె): మండల పరిధిలోని వీరభద్రవరం ఇసుక రీచ్ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను రెవెన్యూ అధికారులు శనివారం సీజ్ చేశారు. తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. వీరభద్రవరం గ్రామ సమీపంలోని గోదావరి ఇసుక రీచ్ నుంచి టిప్పర్లతో ఇసుకను డంపింగ్ చేస్తున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో రెండు టిప్పర్లతో ఇసుకను తరలిస్తుండగా సీజ్ చేసి రెవెన్యూ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.

కమిటీ ఎన్నిక



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ గుడి ఆవరణంలో శనివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణక ఎల్లమ్మ ఆలయ నూతన కమిటీని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా గడ్డం రాజమొగిలి, వైస్ చైర్మన్‌గా సప్పిడి రాంనర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా గడ్డం వినయ్ కుమార్, కోశాధికారిగా తాళ్లపల్లి మోహన్, సహాయ కార్యదర్శిగా గడ్డం ప్రసాద్, సాంస్కృతిక కార్యదర్శిగా ముంజ రాజేందర్‌ను ఎన్నుకున్నారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా గడ్డం సంతోష్, మెర్గు రఘు, గడ్డం రవి, పంజాల కృష్ణ, మోడెం చందు, గడ్డం సతీష్, గౌరవ అధ్యక్షుడిగా కూనిరి అశోక్, మోడెం వెంకటస్వామి, బూర రాజయ్య, మోడెం రమేష్, తాళ్లపల్లి వెంకటస్వామి, వీరేశం, రవిలను ఎన్నుకున్నారు.

ఫిష్‌పాండ్స్‌తో లాభాలు

శాయంపేట : సాధారణ పంట సాగుతో పాటు రైతులు తమ పంట క్షేత్రాల్లో ఫిష్‌పాండ్స్ నిర్మించుకొని అధిక లాభాలు పొందాలని ఏపీఓ కీర్తి అనిత శనివారం ఒక ప్రకటనలో కోరారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతులు తమ పంట క్షేత్రాల్లో 20మీటర్ల పొడువు, 20మీటర్ల వెడల్పుతో ఫిష్‌పాండ్స్ నిర్మాణం చేపట్టుకున్నట్లయితే 100శాతం కూలీ డబ్బులు రైతుల ఖాతాల్లో జమచేయనున్నట్లు తెలిపారు. మత్స్యశాఖ నుంచి ఉచితంగా చేప పిల్లలను అందిస్తామని అన్నారు. చేపలను పెంచి విక్రయించుకున్నట్లయితే అధిక లాభాలు వస్తాయన్నారు. రైతులందరూ ఫిష్‌పాండ్స్ నిర్మాణంపై దృష్టి సారించాలని కోరారు. వీటితో పాటు ఫామ్‌పాండ్స్ నిర్మాణం కూడా చేపట్టుకోవాలని తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



శాయంపేట : వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం సాధించడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో బాణసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. తీన్మార్ మల్లన్న టీం మండల అధ్యక్షుడు తీన్మార్‌జై, పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, నాయకులు చిందం రవి, చింతల రవిపాల్, మామిడి సుదర్శన్, బాసాని మార్కండేయ, నాగరాజు, శంకరచారి, రాజు, కట్టయ్య, సదానందం, రఫీ, సదయ్య, సాదిక్, రాజేందర్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే!

ప్రమాదకరంగా చెరువుకట్టపై దారి

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ప్రమాదకరంగా ఉన్న చెరువు కట్ట

చిట్యాల: మండలంలోని వెంకట్రావుపల్లి(సీ) గ్రామ శివారులోని పెద్ద చెరువు గతంలో కురిసిన వర్షానికి గండి పడింది. దీంతో చెరువులోని నీరు మొత్తం బయటకు పోయి కట్ట కొట్టుకుపోయింది. కాగా, చెరువు పక్కనే రైతుల వ్యవసాయ భూములు, గౌడ కులస్తుల తాడిచెట్లు ఉన్నాయి. ప్రతీ రోజు గౌడ కులస్తులు తాటి చెట్లు ఎక్కి జీవనోపాధి పొందుతున్నారు. దీంతో అదే చెరువు కట్టపై నుంచి గౌడులు, అలాగే రైతులు, కూలీలు పోవాలి. ద్విచక్రవాహనంపై పోతుంటే ప్రమాదం జరిగే అవకాశం ఉందని వారు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధి కారులు కట్టకు మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

మరమ్మతు చేయించాలి



పెద్ద చెరువు కట్ట గతంలో కురిసిన వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో ద్విచక్రవాహనంపై తాటి వనానికి పోవడానికి చాలా ఇబ్బంది పడుతున్నాం. ప్రతి నిత్యం ఇదే దారి వెంట వెళ్లాలి. అదుపుతప్పి పడితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు, ఎమ్మెల్యే స్పందించి చెరువుకట్టకు మరమ్మతు చేయించాలి.

- కమ్మగాని బాలకృష్ణ, గీత కార్మికుడు

పట్టించుకోవడం లేదు



వెంకట్రావుపల్లి (సీ) పెద్ద చెరువు కట్ట గతంలో కురిసిన వర్షాలకు పూర్తిగా కొట్టుకపోయిన కనీసం మరమ్మతు చేయించడం లేదు. తెగిన చెరువు కట్టపై వెళ్తున్న వారికి ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరు. ఇప్పటికైనా మరమ్మతులు చేయాలి.

- నవీన్, బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు

గ్రూప్-1 పరీక్షకు నిబంధనలు సడలించాలి



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్

ములుగు రూరల్: ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రూప్-1 పరీక్షల్లో నిబంధనలు సడలించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రూప్-1 పరీక్షలకు నిమిషం ఆలస్యమైన అనుమతించమని, అర్ధగంట ముందే పరీక్ష కేంద్రం గేట్లు మూసి వేస్తామని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సడలించాలని అన్నారు. గత ప్రభుత్వం చేసిన అక్రమాల కారణంగా నిరుద్యోగులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం గ్రూప్-1 పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



సారయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

ములుగు: జిల్లా కేంద్రానికి చెందిన గాదె లక్ష్మీ, గ్రామ పంచాయతీ కార్మికుడు బలుగూరి సారయ్య, మండలంలోని ఇంచర్ల గ్రామానికి చెందిన కోరండ్ల నర్సింహారెడ్డి ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క శనివారం పరామర్శించారు. మంత్రి వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మండల అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా, యూత్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి తదితరులు ఉన్నారు.

అసాంఘిక శక్తులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై అశోక్

వెంకటాపురం(కె): అసాంఘిక శక్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై అశోక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కర్రవానిగుంపు గ్రామంలో సీఆర్పీఎఫ్ సిబ్బంది సివిల్ పోలీసులతో కలిసి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తామని అన్నారు. గ్రామంలోని అపరిచిత వ్యక్తులు ఎవరైనా వస్తే వారి సమాచారాన్ని పోలీసులుకు అందించాలని అన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. బడి ఈడు కలిగిన పిల్లాలను బడికి పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ పోలీసులు, సీఆర్పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



రేగొండ: బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు



చిట్యాలలో..

రేగొండ: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తున్నాయని భాగిర్థిపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేవూరి అనిత అన్నారు. శనివారం భాగిర్థిపేట గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల గొప్పతనాన్ని, విద్యార్థులకు అందజేస్తున్న వసతుల గురించి తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థులను పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొండ శ్రీనివాస్, ఇంద్రసేనా రెడ్డి, వేల్పుల రాజు, రాజయ్య, భాగ్యలక్ష్మీ, అనురాధ, సుధామల్ల మురళి, సూదం సాంబమూర్తి, సనత్ కుమార్, గుండా రమేష్, చెన్న సరిత, బండి చంద్రమౌళి, రఘు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలి

చిట్యాల: తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని ప్రధానోపాధ్యాయుడు గోవింద సత్యనారాయణ కోరారు. మండలంలోని చల్లగరిగ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో శనివారం బాడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటింటికీ వెళ్లి బడి మానేసిన పిలలతో పాటు చదువుకునే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. తమ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులకు గురుకులలో సీట్లు సాధించినట్లు తెలిపారు. ప్రవేట్ పాఠశాలల్లో కంటే ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ప్రభుత్వం కల్పించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పచ్చిక భాగవాన్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు సౌజన్య, అంగన్‌వాడీ టీచర్, తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి



మాట్లాడుతున్న రవి

ములుగు రూరల్: ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తోకల రవి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అనుమతులు లేని పాఠశాలల యజమాన్యాలు అడ్మిషన్లు చేస్తున్నాయని విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. 2009 విద్యా హక్కు చట్టం ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత విద్యను అందించాలని అన్నారు. పదవ తరగతి పూర్తయిన విద్యార్థుల నుంచి ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం టీసీ, స్టడి సర్టిఫికేట్లకు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, సింహాద్రి, రవితేజతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



సెల్‌ఫోన్ అందజేస్తున్న పోలీసులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో కాటారం మండలం కొండంపేట గ్రామానికి చెందిన బాల సంపత్‌రావు సెల్‌ఫోన్ నాలుగు రోజుల క్రితం పోయింది. వెంటనే కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో సెల్‌ఫోన్‌ను గుర్తించి ఎస్సై భవానిసేన్, కానిస్టేబుళ్లు శనివారం బాధితుడికి అందజేశారు. ఇప్పటికే కాళేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 20కిపైగా పోగొట్టుకున్న ఫోన్లను బాధితులకు అందజేసినట్లు ఎస్సై తెలిపారు.

వాహనాల తనిఖీ



ఇసుక లారీని తనిఖీ చేస్తున్న పోలీసులు

వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై వెంకటాపురం(కె) సీఐ బండారి కుమార్, వాజేడు ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు ప్రయాణికుల బ్యాగులను సోదాలు చేశారు. ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొత్త వ్యక్తులు, అపరిచితులు, అనుమానితులు తారసపడితే సమాచారం ఇవ్వాలని వాహనదారులను ఆదేశించారు. అలాగే ఇసుక లారీలు నిబంధనల ప్రకారం ఇసుక తరలిస్తున్నది లేనిది పరిశీలించారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్ట పరంగా చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు.

రామోజీరావు మృతి తీరని లోటు



వాజేడు: నివాళులర్పిస్తున్న మీడియా సభ్యులు


ములుగు: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతి రెండు తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్, ప్రియా ఫుడ్స్ వంటి వ్యాపారాలను నెలకొల్పి వేలాదిమందికి ఉపాధికల్పించారని గుర్తు చేశారు. రామోజీ ఫిల్మ్‌సిటీని ఏర్పాటు చేసి సినీరంగం హైదరాబాద్‌లో అభివృద్ధి చెందడంలో భాగస్వామి అయ్యారని అన్నారు.

రామోజీరావు మృతిపై ఎమ్మెల్యే విచారం

భూపాలపల్లి రూరల్: రామోజీరావు మృతి చెందడంపై ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామోజీరావు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామోజీరావు లాంటి గొప్ప వ్యాపారవేత్తను కోల్పోవడం రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశానికి కూడా తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.

వాజేడు: మండలంలో రామోజీరావు చిత్రపటానికి వాజేడు మీడియా, మండల మీడియా అసోసియేషన్ల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో విలేకర్లు దావూద్, సతీష్, వేణు, దామోదర్, సర్వేశ్వరరావు, మల్లికార్జున్ రావు, శ్రీనివాసరెడ్డి, రాంబాబు, పాషా, వరప్రసాద్, కాంగ్రెస్ నాయకులు విక్రాంత్, ఖాజావలి, జగన్నాథరాజుతో పాటు తదితరులు ఉన్నారు.

మాజీ జెడ్పీటీసీ మృతి



మల్లయ్య (ఫైల్)

కాటారం: కాటారం మాజీ జెడ్పీటీసీ దుర్గం మల్లయ్య (60) అనారోగ్యంతో మృతి చెందాడు. కొన్ని రోజు లు గా అనారోగ్యంతో బాధపడుతున్న మల్లయ్య ఓ ప్రైవే ట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మల్లయ్యకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఆయ న మృతిపై బీజేపీ నాయకుడు చల్ల నారాయణరెడ్డి తీవ్రదిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

సామాజిక తనిఖీ గ్రామసభలు

కాటారం: మండలంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా కొనసాగిన పనులపై సామాజిక తనిఖీలు కొనసాగుతున్నాయి. గ్రామాల్లో తనిఖీ బృందాలు పనులను పరిశీలించి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. పనుల్లో జరిగిన లోటపాట్లు, ఏమైన అతినీతి జరిగితే గుర్తించి రికార్డుల్లో పొందుపరుస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం మొదటి విడతగా మండలంలోని 12 గ్రామపంచాయతీల్లో తనిఖీ బృందం సభ్యులు గ్రామసభలు నిర్వహించారు. నాలుగు రోజులుగా గ్రామాల్లో ఉపాధి పనుల్లో సేకరించిన వివరాలను గ్రామసభలో చదివి వినిపించారు. ఈ నెల 13న మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎస్ఆర్‌పీ కొమురయ్య తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ములుగు రూరల్: మండలంలోని జాకారం గిరిజన మినీ గురుకుల పాఠశాలలో అడ్మిషన్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హెచ్ఎం జయశ్రీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మినీ గురుకులం పాఠశాలలో సీబీఎస్ఈలో ఒకటవ తరగతిలో 30 అడ్మిషన్లు, నాల్గవ తరగతిలో 05, ఐదవ తరగతిలో 18 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ములుగు మండల పరిధిలోని గిరిజన బాలికలకు అవకాశం ఉందని అర్హత కలిగిన వారు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఒకటవ తరగతిలో అడ్మిషన్‌కు విద్యార్థులకు 5 సంవత్సరాలు నిండి ఉండాలని అన్నారు. విద్యార్థులకు ఉచిత భోజనం, వసతి, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, కాస్మోటిక్స్ ఉచితంగా అందిస్తామని అన్నారు. పూర్తి వివరాల కోసం జాకారం మినీ గురుకుల పాఠశాలలో లేదా ఫోన్ నంబర్ 97018 53439 సంప్రదించాలని అన్నారు.

చెరువుల్లో మట్టి దొంగలు!



మట్టిని నింపుతున్న పొక్లెయినర్



రాత్రి మట్టిని చెరువు నుంచి తరలించేందుకు సిద్ధంగా ఉన్న టిప్పర్లు

- యథేచ్ఛగా తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు

టేకుమట్ల: గ్రామాల్లోని చెరువు మట్టిని పంట పొలాల్లో పోసుకునేందుకు ఇరిగేషన్ బోర్డు అధికారులు అనుమతులను ఇవ్వగా ఇదే అదునుగా కొంత మంది మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. అనుమతుల పేరిట ఇష్టారీతిన వ్యవహరిస్తూ ఇటుక బట్టీలకు చెరువుల మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రైతుల పంట పొలాలకు ప్రభుత్వం చెరువుల్లో మట్టి తవ్వకాలకు అనుమతులు మంజూరు చేయగా మండలంలోని పలు గ్రామాల రైతులు పోపించుకున్నారు. ఇదే అదునుగా కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లోని ఇటుక బట్టీ వ్యాపారులు స్థానికుల సాయంతో పగలు, రాత్రి అనే తేడా లేకుండా లారీ, టిప్పర్లలో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు.

కుందనపల్లి చెరువు నుంచి..

కొన్ని రోజులుగా మండలంలోని కుందనపల్లి చెరువులో ప్రభుత్వ అనుమతుల పేరుతో నిత్యం పదుల సంఖ్యలో లారీల్లో మట్టిని తరలిస్తున్నారు. మట్టి తరలింపునకు చెరువు నుంచి ప్రధాన రోడ్డు వరకు ప్రత్యేక దారిని సైతం ఏర్పాటు చేశారు. ఇంత జరుగుతున్న ఇరిగేషన్ బోర్డు అధికారులు మాత్రం చెరువుల వైపు చూసిన దాఖలాలు లేవని మండల ప్రజలు వాపోతున్నారు.

ప్రమాదకరంగా గుంతలు

చెరువుల్లో అక్రమ మట్టి తవ్వకాలతో చెరువుల్లో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారుతున్నాయి. వర్షాకాలంలో చెరువుల్లోకి నీరు చేరి భారీ గుంతలు ఏర్పడి రైతులు, పశువులు, మత్స్యకారులు మృత్యువాతపడే అవకాశం ఉంది. గతంలో ఎంతో మంది చెరువుల్లో అక్రమ తవ్వకాల వల్ల ఏర్పడ్డ గుంతల్లో రైతులు, పశువులు మృతి చెందిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనలు అతిక్రమిస్తూ, చెరువుల్లో మట్టి అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరతున్నారు.

ప్రమాదకరంగా విరిగిన చెట్టుకొమ్మ



చిట్యాల: చిట్యాల నుంచి జూకల్‌కు వేళ్లే దారిలో ఎస్సారెస్పీ కాలువ వద్ద ఇటీవల గాలిదుమారానికి చెట్టుకొమ్మ విరిగి వేలాడుతుంది. దీంతో వాహనాదారులు ఇబ్బంది పడుతున్నారు. కనీసం ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనాదారులు దగ్గరగా పోతే వారిపైన విరిగిపడే పరిస్థితి ఉంది. ఆర్టీసీ బస్‌కు తాకి కొమ్మ పడితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం నెలకోంది. ఎవరికి ఏలాంటి ప్రమాదం జరుగకుండా ముందే అధికారులు స్పందించి విరిగిన చెట్టు కొమ్మను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.